# దక్షిణాఫ్రికా తీవ్రమౌతున్న ప్రజల అసంతృప్తి

**దక్షిణాఫ్రికా** మాజీ అధ్యక్షుడు జాకబ్ జుమాను జూలైలో అరెస్టు చేసిన సందర్భంగా మరోసారి ప్రజలు రోడ్లపైకి రావటమేగాక, దాడులు, లూటీలకు పాల్పడ్డారు. ఈ ఘటనలు ప్రధాంగా అలెగ్జాండ్రియా వంటి పట్టణ ప్రాంతాల శివారుల్లో చోటుచేసుకున్నాయి. అయితే ఈ దాడులు, నిరసనలన్నీ జుమా అరెస్టుకు వ్యతిరేకంగా మాత్రమే జరిగాయని మనం నిర్ధారణకు రాగలమా? రాలేము. తుపాకులకు ఎదురొడ్డటానికి ప్రజలకు దీనికి మించిన బలమైన కారణాలున్నాయి. ఒకానొక దశలో పోలీసులు, సైన్యం ఏమీ చేయలేక అచేతనంగా నిలబడిపోయారు. ప్రధానంగా సూపర్ మార్కెట్లలో, వేర్‌హౌస్ గోడౌన్లలో ఈ లూటీలు జరగటం, అత్యధిక కేసుల్లో ప్రజలు ఆహారధాన్యాలు, ఆహార పదార్ధాలను ఎత్తుకెళ్ళటం గమనిస్తే, ఆహారం, ఆకలి, నిరుద్యోగం మొత్తంగా ఆర్ధిక వ్యవస్థకే సంబంధించిన గంభీరమైన సమస్య వున్నట్లుగా తెలుస్తోంది. ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలపటం ఇదేదో మొదటిసారి కాదు. నిజానికి ప్రజల నిరసన, ఆందోళన, పోరాటాలకు దక్షిణాఫ్రికాలో సుదీర్ఘ చరిత్రే వుంది.

1990ల ప్రారంభ కాలంలో జాతి వివక్ష విధానాన్ని అంతం జేసేందుకు మండేలా నాయకత్వంలో దుష్ట పాలకులతో కుమ్మక్కైన ఒక పోరాటం జరిగింది. జాతివివక్ష, విడగొట్టి చూడడం వంటివాటిలో కొన్ని సామాజిక, రాజకీయ మార్పులు జరిగినప్పటికీ, దోపిడీ ఆర్ధికవ్యవస్థను సమూలంగా మార్చుకునేందుకు పోరాటాల కొనసాగింపు లేకపోయింది. జింబాబ్వేలో తదనంతర కాలంలో జరిగిన విధంగా శ్వేతజాతీయుల భూములు లేదా వ్యాపారాలు నల్లజాతీయుల చేతులలోకి రాలేదు. అందువలన అసమానతలతోనున్న దేశం అసమానతలలోనే వుండిపోయింది, ఐతే ఉన్నతస్థాయికి చేరిన కొద్దిమంది నల్లజాతీయులు, దీర్ఘకాలంగా శ్వేతజాతీయులు పాలించిన స్థానాలలోకి వెళ్ళారు. కనుక, దక్షిణాఫ్రికా ఈనాటికీ ప్రపంచంలో అత్యధిక అసమానతలున్న దేశంగానే వుంది.

### గుప్తా సోదరులు – దక్షిణాఫ్రికా'అందానీ'లు

ఇదేకాలంలో (1993 సం॥లో) దక్షిణాఫ్రికాలో వున్న భారతీయులు తమ వ్యాపారాలు ఇంకెంతకాలమో కొనసాగవని భావిస్తున్న సమయంలో, గుప్తా సోదరులు వ్యాపారం సాగించటానికి దక్షిణాఫ్రికాలో అడుగుపెట్టారు. వారిరువురికీ కలిపి ఉమ్మడిగా అందానీ (అంబానీ + ఆదానీ) అనే పేరుంది. గుప్తా సోదరులు అప్పటికే ఢిల్లీలో మోసపూరితంగా వ్యాపారాలు సాగించి 'విజయాలు' సాధించారు. భారతదేశంలో వారు ఆధిపత్యకులానికి చెందిన వారైనప్పటికీ, దక్షిణాఫ్రికా శ్వేతజాతీయుల కన్నా తక్కువగా పరిగణించబడే వారైనప్పటికీ, శ్వేతజాతేతరులకు ధనవంతులయ్యే అవకాశం లభిస్తే వారు కాంట్రాక్టులను, వ్యాపారాలను సంపాదిస్తారని చూపించారు. వీరు అంతర్జాతీయ పెట్టుబడి బినామీలుగా, బహుళజాతి కంపెనీల ఏజెంట్లుగా రూపుదాల్చారు. జుమా కార్యకలాపాలను వారే ప్రాయోజితం చేసేవారు; జుమా కుమారుణ్ని తమ కంపెనీలకు డైరెక్టరును చేశారు. జుమా దేశాధ్యక్షుడయిన తర్వాత ప్రభుత్వంపై వారు పూర్తి అదుపును సాధించారు. సామ్రాజ్యవాద వాస్తవిక ముఖాలను చూపకుండా తప్పిస్తూ వీరి పరపతిని తరచుగా 'స్టేట్ క్యాప్చర్' అంటూ మీడియా పేర్కొనేది. అంతర్జాతీయ కాంట్రాక్టులు ఎవరు పొందాలో నిర్ణయించే ఆర్ధిక శాఖామంత్రి నియామకం దగ్గర నుండి, దాదాపు అన్ని విషయాల్లోనూ వారికి అధికారం వుండేది. అంతర్జాతీయ సంస్థలు ఒప్పందాల కోసం వారితో సమావేశమయ్యేవి. దక్షిణాఫ్రికా విద్యుత్ వినియోగ కంపెనీ ఎస్కోమ్‌తో దక్షిణాఫ్రికాలో అతిపెద్ద కాంట్రాక్టు పొందడానికి మెకెన్‌సే కంపెనీ 'అందానీ'లతో చేతులు కలిపింది. 38 మిలియన్ డాలర్లపైగా ధనాన్ని ఎస్కోమ్ నుండి పొంది, దాని విధ్వంసానికి వారు కారకులయ్యారు. తమ నేరాలపై విచారణ సాగించే ఉన్నతాధికారుల సమగ్రత, నడవడికలపై తప్పుడు వార్తలను వ్యాపింపజేయడానికి లండన్‌కు చెందిన ఓపిఆర్ కంపెనీని వారు స్థాపించి నడుపుతున్నారు. కెపిఎమ్‌జి, మెకెన్‌సే, ఎన్‌ఏపి వంటి ప్రముఖ అంతర్జాతీయ పరిశ్రమలను ఏర్పాటుచేసుకొని, దేశీయ కోశాగారం నుండి 7 బిలియన్ డాలర్ల వరకు కొల్లగొట్టారు. అంతిమంగా సామ్రాజ్యవాద దోపిడీ సృష్టించిన ఈ పరిస్థితికి వ్యతిరేకంగా ప్రజానిరసనలన్నీ సంపూర్ణంగా దళారీలైన ఈ గుప్తా బ్రదర్స్‌కు వ్యతిరేకంగా మళ్ళాయి. దానితో వారు దుబాయ్‌కు వెళ్ళిపోయారు; జుమా అధికారం కోల్పోగా ప్రజల పరిస్థితి మాత్రం యధాతధంగా వుంది.

### సామాజిక – ఆర్ధిక పరిస్థితులు

ఈ విధంగా అధికారయుతంగా జాతి వివక్షను తొలగించిన తర్వాత కూడా, పెట్టుబడిదారుల, రాజకీయవర్గాల దోపిడీ బాహాటంగా కొనసాగింది. భూమి సమస్య, పట్టణ ఇళ్ళ నిర్మాణ సమస్య, నిరుద్యోగం, అత్యధికులు పేదరికంలోకి దిగజారటం కొనసాగాయి. పేదరిక నిర్మూలన పథకాలు, మురికివాడల పునరుద్ధరణ ప్రాజెక్టుల వంటివన్నీ పాలకుల, పెట్టుబడిదారుల

జేబులు నింపటానికి తోడ్పడ్డాయి. ఫలితంగా 25 సం॥లలోపు వయసున్న యువతలో 74 శాతానికి ఉద్యోగాలు లేవు. శ్రామికులలో 45 శాతం మందికి ఉపాధి లేదు. దక్షిణాఫ్రికాలో సగం జనాభా తీవ్రమైన పేదరికంలో మగ్గుతున్నారు. ఆస్తులు, ఆదాయాల స్థాయిలలో అసమానతలు తీవ్రమై, ప్రపంచంలోని దేశాలలోనే ఆర్థికంగా అత్యంత అన్యాయమైన సమాజాలలో ఒకటిగా దక్షిణాఫ్రికా నిలిచింది. అత్యున్నతస్థాయిలో వున్న 20 శాతం ధనికులు – మొత్తం ఆదాయంలో 70 శాతం కలిగి వున్నారు. కాగా, దిగువస్థాయిలోనున్న 40 శాతం మంది ప్రజానీకం కేవలం మొత్తం ఆదాయంలో 7 శాతమే పొందుతున్నారు. 2002 నాటికే, ప్రభుత్వం మౌలిక ఆదాయ గ్రాంట్ గురించి చర్చించింది. కానీ దానిని అమలుచేయలేదు. ప్రజలు దుర్భర పేదరికంతో బాధలు అనుభవిస్తున్నారు. అయినప్పటికీ రాజ్యానికి వారు కనిపించలేదు. ప్రపంచ దేశాలలో పేద ప్రజానీకం నిరసనల ద్వారానే వారి గురించి ప్రపంచానికి తెలియజేయగలుగుతారు. ఆ విధంగా దక్షిణాఫ్రికా ప్రజలు బయటకొచ్చి తమ న్యాయమైన డిమాండ్లపై నిరసన, ప్రదర్శనలు నిర్వహించారు.

## కోవిడ్ మునుపు పరిస్థితి

కోవిడ్ ప్రవేశానికి ముందు కూడా దక్షిణాఫ్రికా సాంకేతికంగా మాంద్యం ఎదుర్కొంటోంది. (రెండు వరుస త్రైమాసికాల్లో నెగెటివ్ (గ్రోత్ నమోదైంది) లాక్‌డౌన్లతో ఇది మరింత దిగజారింది. దేశీయ రుణం 2017 నుండి భయపెడుతూ వుంది. 2020లో ప్రభుత్వ రుణం జిడిపిలో 83 శాతంగా వుంది. ఈ రకమైన భారీ రుణస్థాయిలు, దుర్భరమైన వడ్డీలన్నీ కలసి సామాజిక సంక్షేమం, సేవలందించే రంగాలపై వెచ్చించే నిధులన్నింటినీ మింగేస్తున్నాయి. ఎస్కామ్ కుప్పకూలటం, గుప్తా సోదరుల 'స్టేట్ క్యాప్చర్' ప్రజల పరిస్థితిని మరింత దుర్భరం చేసింది. దీనికి తోడుగా, దక్షిణాఫ్రికాలోని కొన్ని ప్రాంతాలలో అనేక సంవత్సరాలుగా కరవు పట్టి పీడిస్తోంది. అనేక చిన్న పట్టణాలకు పూర్తిగా నీటి సరఫరా వైఫల్యాలతో పశువుల రైతులు ఆర్థికంగా మరింత చితికిపోయారు. దేశంలోని ఇతర ప్రాంతాలలో – తీవ్ర వడగాడ్పులు, వర్షాలు ఆలస్యంగా ప్రారంభం కావటం స్థానిక సరఫరాల వైఫల్యానికి కారణమైంది. వాస్తవానికి 2019లో సంభవించిన చారిత్రాత్మక స్థాయి కరవుకు 11 మిలియన్‌ల ప్రజలు ఆహార కొరతనెదుర్కొన్నారు. ఈ ప్రాంతమంతా ఆహారధాన్యాల ఉత్పత్తి 30 శాతం తగ్గిపోయింది. కొన్ని ప్రాంతాలలోని ప్రజానీకం 2–3 రోజులకొకసారి మాత్రమే తినగలిగేవాళ్ళు. నీరు, పశువుల దాణాల కొరత కారణంగా రైతుల పశువుల మందలన్నీ తుడిచిపెట్టుకొనిపోయి, రైతాంగం తమ జీవనోపాధిని కోల్పోయారు. అదేవిధంగా 2018 జనవరిలో 40 లక్షల జనాభా కలిగిన కేప్‌టౌన్ నగరానికి అప్పటికి 3 నెలల కాలంగా మునిసిపల్ తాగునీరు సరఫరా జరగలేదని అధికారులు ప్రకటించారు. తరువాత నీటిసరఫరాను పునరుద్ధరించారు.

## పరిష్కారంగా మరిన్ని సంస్కరణలు

ఈపైన పేర్కొన్న సమస్యలన్నీ వ్యవస్థను సమూలంగా రుపుమాపి, నూతన వ్యవస్థను నిర్మించుకోవల్సిన అవసరాన్ని తెలియజెప్తుండగా, కార్పొరేట్ ప్రసార మాధ్యమాలు మాత్రం దీనిని సేవలందించటంలో సమస్యగా మాత్రమే పేర్కొంటూ, దీనికి సంస్కరణలే పరిష్కారమంటూ ప్రబోధిస్తున్నాయి. ఈవిధంగా సామ్రాజ్యవాదులు – సమస్యలకు కారణమౌతున్న ఆ సంస్కరణలను మరింత తీవ్రమైన రూపంలో అమలుచేయమనటాన్నే పరిష్కార మార్గంగా ముందుకు తెస్తున్నారు. దీనిలో భాగంగానే, అవినీతి ఆరోపణలపై ప్రాచుర్యం పొందిన నాయకుడైన జుమాను తొలగించి, సంస్కరణలకు అనుకూలమైన సిరిల్ రమాఫోసాను గద్దెనెక్కించారు. అనేక దేశాలలో ప్రాచుర్యం పొందిన నాయకులను అవినీతి ఆరోపణలపై తొలగించి, మితవాద సంస్కరణవాదులను లేదా నియంతలను అధికార పీఠంలో కూర్చోబెడ్తున్న వెలుగులో దీన్ని కూడా చూడాలి. మరింతమందిని పన్ను చెల్లింపు పరిధిలోకి తేవటానికి, సంక్షేమ పథకాల్లో మరింత కోత విధించటానికి, ప్రభుత్వ వేతనాలను మరింతగా తగ్గించటానికి, ప్రభుత్వరంగ సంస్థలను పునర్నిర్మించటానికి, నియంత్రణా చట్టాల కృషిని 'మెరుగుపరచుకోవటానికి' రవాణా, మౌలిక వసతులు, ఆరోగ్య రక్షణ బాధ్యత నుండి ప్రభుత్వాన్ని క్రమంగా తప్పించటానికి, శ్రమశక్తి అధికంగా అవసరమైన పరిశ్రమల్లో కనీస వేత చట్టానికి మినహాయింపు కోసం నయా ఉదారవాద సంస్థలు మరిన్ని సంస్కరణలకు పిలుపునిస్తున్నాయి. ఈ విధంగా అన్ని అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనూ జరుగుతున్న తీరులోనే సంస్కరణలనేవి సామ్రాజ్యవాద దోపిడీకి అనుకూలంగా వున్నాయి.

అదేవిధంగా దేశాన్ని క్రెడిట్ రేటింగ్స్‌లో దిగజార్చిన మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్, దక్షిణాఫ్రికా ప్రజాస్వామ్య దేశంగా ఏర్పడిన తర్వాత మొదటిసారిగా 'పెట్టుబడి మదుపు గ్రేడ్' లేకుండా తొలగించింది. ఇది దేశీయ పెట్టుబడి మార్కెట్లపై వత్తిడి కల్గించి, ఎక్కువ వడ్డీరేట్లకు తలొగ్గేవిధంగానూ, మారకద్రవ్య రేటు క్షీణించటంతోనూ, రుణాల మొత్తం పెరుగుదలతోనూ, పొడిగింపుతోనూ దక్షిణాఫ్రికా ఆర్థికవ్యవస్థలో విశ్వాసాన్ని తగ్గించివేస్తోంది.

2021 ఏప్రిల్‌లో కనీస వేతనం కేవలం 4.5 శాతం మేరకు పెరగగా, ఆహారం, రవాణా, విద్యుత్తు ఛార్జీల ధరలు 7 నుండి 15 శాతం వరకు పెరిగాయి. దీనర్థం లక్షలాది మంది ప్రజానీకం ఆకలి బాధలకు గురయ్యారు. అప్పటిదాకా

ప్రభుత్వం కోవిడ్-19 సందర్భంగా సోషల్ రిలీఫ్ డిస్ట్రెస్ (ఎస్ఆర్‌డి) పేరిట సహాయం అందించేది. ఆహార పేదరిక రేఖ అయిన 585 ర్యాండ్ల కంటే ఎంతో తక్కువ అయిన నెలకు 350 ర్యాండ్ల ఈ కేటాయింపును (ఒక ర్యాండు 5 రూపాయలతో సమానం) కూడా ఇదే నెలలో రద్దుచేసింది.

చిన్నపిల్లలకు అందించే సహాయం, వృద్ధాప్యంలో వున్నవారికి అందించే ఫించన్ల వంటివన్నీ కోవిడ్ మొదటవేవ్ వెనువెంటనే రద్దు చేశారు. చిన్నపిల్లలకు అందించే సహాయం చాలా చిన్నదైనప్పటికీ అది రద్దు చేయటంతో చిన్నపిల్లలు పెద్ద సంఖ్యలో ఆకలితో అలమటించారు.

ఈవిధంగా దక్షిణాఫ్రికా ప్రజానీకం దయనీయ పరిస్థితులలో వున్నారు. ఈ మొత్తం చిత్రాన్ని సమగ్రంగా వీక్షించగలిగితే, వ్యవస్థీకృత సంక్షోభం, దాని తీవ్రత మనకు అర్థమౌతుంది.

పెట్టుబడిదారీవ్యవస్థ సృష్టించి, పెంచి పోషించే పేదరికం, అసమానతలు తీవ్రస్థాయిలో వుండి, ప్రజల జీవితాలను, జీవనాధారాలను సర్వనాశనం చేసింది. వారికి బిగిసిన సంకెళ్ళను తప్ప, ఇంక వారు కోల్పోవలసిందేమీ మిగలలేదు. సంఘటిత నిరసనలు, ఐక్యపోరాటాలే దానికి పరిష్కారం.

అన్ని దేశాలలో సామ్రాజ్యవాదం పీడిత ప్రజానీకాన్ని ఈ తరహాలోనే దోపిడీ చేస్తోంది. ఆయా దేశాలలో సంపదను కొల్లగొట్టి, ఆ దేశ ప్రజలను పేదరికంలోకి విసిరివేస్తోంది. వారి పరిస్థితులు మరింతగా, మరింతగా దిగజారి, ఇక తాము పోరాటం చేసి తన బానిస బంధనాలను తొలగించుకోవటం మినహా మరో దారిలేని స్థితికి చేరుకుంటారు. అయితే ఈ పోరాటాలు మరింత ఐక్యంగా, మరింత సంఘటితంగా సామ్రాజ్యవాదుల లూటీని వ్యతిరేకిస్తూ, ప్రజల అసమ్మతిని నిర్మాణాత్మకమైన ఉద్యమ రూపంలో మలచటం ద్వారా దోపిడీ వ్యవస్థ పునాదులను కుదిపివేయగల్గుతాం. దక్షిణాఫ్రికాలో ప్రగతిశీల, ప్రజాస్వామిక శక్తులు వారి దేశ ప్రజాస్వామిక కర్తవ్యాలను నెరవేరుస్తారని ఆశిద్దాం.

★★★★★